క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

రొంపిచెర్ల: జీడీఎస్ ఉద్యోగుల సమస్యలపై గురువారం రొంపిచెర్లలో పోస్టల్ ఉద్యోగులు ఆందోళన చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ, తపాలా ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదాను వెంటనే ఇవ్వాలన్నారు. 8 గంటల పని కల్పించాలని, 12,24,36 అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. 180 రోజుల వరకు సెలవులను దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ 10 శాతం ఇచ్చి, తాత్కాలిక పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి నిరవధిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల యూనియన్ నాయకులు బి.ప్రభాకర్ రెడ్డి, టి.మధుమోహన్ నాయుడు, వెంకటరత్నం, సహదేవనాయుడు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



గ్యాస్ ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

కుప్పం: అకస్మికంగా సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఐఆర్ఎం విద్యా కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రధానంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సురక్షితంగా ఎలా బైటపడాలో ఆయన వివరించారు. అంతేకాండా గాయపడిన వారికి మొట్ట మొదట చేయవలసిన ప్రథమ చికిత్స గురించి తెలియజేశారు. అనంతరం కళాశాల చైర్మన్ దయానిధి అగ్నిమాపక అధికారులను సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ



రవీంద్రనాథరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా దేశిరెడ్డి రవీంద్రనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీహెచ్‌సీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా, సర్పంచ్ రాణెమ్మ, ఎంపీడీఓ రాజశేఖర్, నాయకులు ప్రభాకర్, గోవర్థన్, నాగిరెడ్డి, దామోదర్, శ్రీనివాసులు, మెడికలాఫీసర్ డాక్టర్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు షాపింగ్ కాంప్లెక్సు ప్రారంభం



నూతన భవనంలో పూజలు చేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: నగరంలోని మిట్టూరులో నిర్మించిన పోలీసు వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్, అవుట్ పోస్టు విభాగాన్ని ఎస్పీ రిషాంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మిట్టూరులో ఉన్న పోలీసు ఆస్పత్రి వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఎస్పీ తెలిపారు. దీనిద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమానికి ఉపయోగిస్తామన్నారు. భవన నిర్మాణానికి కృషి చేసిన ఆర్ఐ మధును ఎస్పీ అభినందించారు. త్వరలోనే ఇక్కడ పోలీసు ఔట్ పోస్టు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, బాబుప్రసాద్, విష్ణు రఘువీర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



తవణంపల్లె: మండలంలోని బాపినాయుడుపల్లె దగ్గర జూద మాడుతున్న నలుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బాపినాయుడుపల్లెకు చెందిన సోమశేఖర్(47), బాబు(50), జీవన్‌కుమార్(32), వినాయక(47) బీడు భూమిలో పేకాడుతుండగా అరెస్టు చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.7,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పంటలు నష్టపోయాం..

- పంట నష్టంపై అధికారులకు రైతుల ని'వేదన'
- మండలంలో పర్యటించిన కేంద్రం బృందం
- ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్న కేంద్ర బృందం



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రామకుప్పం: మండలంలోని గొరివిమాకులపల్లె, బందార్లపల్లెలో గురువారం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం క్షేత్రస్థాయిలో పర్యటించింది. రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించింది. సీజన్‌లో వర్షాలు పడకపోవడంతో పంట పూర్తిగా నష్టపోయినట్లు రైతులు కేంద్ర బృందం సభ్యుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గొరివిమాకులపల్లెకు చెందిన సరోజమ్మ 64 సెంట్ల భూమిలో తాను పండించిన వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయానని, పంట వేయడానికి దాదాపుగా రూ.30 వేలు ఖర్చు అయ్యిందని ఆమె తెలిపింది. అలాగే బందార్లపల్లెకు చెందిన సుజాతదీ ఇదే పరిస్థితి. వర్షాభావం మూలాన పంట నష్టపోయామని, ఆవులకు మేతగా వదిలివేశామని, తమను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితులు, పంటల వివరాలను కేంద్ర బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో తాము గుర్తించిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు కృష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ దేవేంద్రరావు, ఎంఎన్‌సీఎఫ్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ అంజు బసెరా, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా పశుసంవర్థకశాఖాధికారి ప్రభాకర్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మురళి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, మండల వ్యవసాయాధికారి అమృత పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయండి



స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ఈ నెల 26 నుంచి సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఆయన ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పోర్ట్స్ కిట్లను పంచాయతీలకు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శారీరక, మానసికోల్లాసంతో ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి ఆటలపోటీలు నిర్వహణకు పూనుకుందన్నారు.. ఈ పోటీలకు ప్రతి సచివాలయం నుంచి పోటీ పడి, జిల్లా స్థాయి వరకు వెళ్లి బహుమతులను సాధించాలన్నారు. స్పోర్ట్స్ కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ప్రథమ స్థానంలో నిలవాలనే ధ్యేయంతో ఆడాలన్నారు. సచివాలయ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామీణ యువతను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

భరత్ గెలుపే లక్ష్యం



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దుర్గ

కుప్పం: కుప్పంకు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన భర్త ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపించాలని ఆయన సతీమణి దుర్గ కోరారు. గురువారం కుప్పం మున్సిపాలిటీలో 21వ వార్డులో ఆమె పర్యటించారు. ఆర్‌వీఆర్ వీధి, మురగన్ టాకీస్ రోడ్డు , మర్రిమాను వీధి ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు సారె పంపిణీ చేసి మాట్లాడారు. పదేళ్లుగా తన మామ చంద్రమౌళి కుప్పం ప్రజలకు సేవ చేశారని, ఆయన దివంగతులు కావడంతో ఐదేళ్లుగా భరత్ అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నారన్నారు. ఆయన ప్రజాసేవకే కంకణబద్ధులయ్యారన్నారు. దీనిని గుర్తించి తన భర్తకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. తన తండ్రి ఆశయాల సాధనకు మూడవసారి కుప్పం అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా భరత్ పోటీ చేస్తున్నారని, ఆయన్ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, స్థానిక కౌన్సిలర్ ఎంఆర్ సురేష్ , పార్టీ నాయకులు పాల్గొన్నారు,

ప్రాజెక్టుల నిర్మాణాన్ని అడ్డుకుని నీతులు చెప్పొద్దు

చౌడేపల్లె: పుంగనూరు నియోజకవర్గంలో ప్రాజెక్టుల నిర్మాణ పనులను అడ్డుకున్న కుసంస్కారి రామచంద్ర యాదవ్ నీతులు చెప్పడం ఏమిటని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్ మండిపడ్డారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల కృషితో నేతిగుట్లపల్లె, ఆవులపల్లె వద్ద ప్రాజెక్టులను మంజూరు చేయించారన్నారు. చంద్రబాబు నాయుడుతో రామచంద్రయాదవ్ కలిసి న్యాయస్థానానికి వెళ్లి అడ్డుకోవడం న్యాయమా? అని సూటిగా ప్రశ్నించారు. రైతుల శ్రేయస్సు కోసం యాత్రలు చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న యాదవ్ సమాధానం దీనికి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న పుంగనూరులో అనవసరంగా రాద్ధాంతం చేస్తూ, రెచ్చగొట్టి, గొడవలు సృష్టిస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీటీసీ శ్రీరాములు, పార్టీ సేవాదళ్ కార్యదర్శి హరీష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి



హిదాయిత్ నగర్‌లో బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ అలీం బాషా, అమ్ము

పుంగనూరు: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల ఫలాలు అంది ఆర్థికంగా అభివృద్ధి చెందాయని మున్సిపల్ చైర్మన్ అలీం బాషా పేర్కొన్నారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 14వ సచివాలయ పరిధిలో నిర్వహించారు. డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. హిదాయత్ నగర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లతో ఆయన ప్రచారం చేశారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రెండవసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్లు నరసింహులు, కాళిదాసు పార్టీ నేతలు బావాజాన్, అజీజ్, అమ్ముకుట్టి తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: భక్తాగ్రేసరుడు, శ్రీ కృష్ణుడి కరుణాకటాక్షుడైన కనకదాసు విగ్రహం ఏర్పాటుకు పూనుకోవడం శుభప్రదమని ఎంపీపీ యువరాజు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో మండల కురబ సంఘ అధ్యక్షుడు బాలు ఆధ్వర్యంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ, సర్పంచ్ పీఎస్ లక్ష్మి హాజరయ్యారు. వారు కురబ కులస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

అండగా ఉంటాం ఆదరించండి



మృతి చెందిన పురుషోత్తం కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పద్మమ్మ

గుడుపల్లె: మీ కుటుంబంలోని వ్యక్తిగా నిత్యం అండగా ఉంటామని, ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించాలని భరత్ తల్లి పద్మమ్మ కోరారు. గురువారం మండలంలోని సోడిగానిపల్లె, సంగనపల్లె, బోయనపల్లె గ్రామాలలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ వివిధ పథకాల ఫలాలను సీఎం అందజేశారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే అందేవని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అర్హతే ప్రామాణికంగా పథకాలను దరి చేరుస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం బోయనపల్లెలో ఇటీవల మృతి చెందిన పురుషోత్తం కుటుంబాన్ని పరామర్శించారు. పురుషోత్తం భార్య నాగమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్సీతో మాట్లాడి కొత్తగా ఇల్లు కూడా మంజూరు చేయిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి, సర్పంచ్ అమరనాథ్, యూత్ రవి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

- కలెక్టర్ ఆదేశాలతో తాళాలు తీశారు
- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ కోసమే
- మూడో రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



పట్టణంలో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను తీస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: మూడు రోజులుగా అంగన్‌వాడీ సెంటర్లకు తాళాలేసి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల కారణంగా పలమనేరులోని ఆయా సెంటర్ల పరిధిలోని లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా మహిళలతో కలసి గురువారం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను తీశారు. మున్సిపాలిటీలో 14 సెంటర్లు, రూరల్‌లో 22 కేంద్రాల తాళాలను తీసినట్టు స్థానిక సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. మొత్తం సెంటర్లను శుక్రవారం మధ్యాహ్నానికల్లా ఓపెన్ చేసి సేవలను ప్రారంభిస్తామన్నారు. ఇలా ఉండగా మూడు రోజులుగా పలమనేరులోని సీడీపీఓ కార్యాలయం వద్ద క్లస్టర్‌లోని అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్యల కోసం సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం సైతం వారు తమ డిమాండ్లను పరిష్కరిస్తేగానీ సెంటర్లకు వెళ్లబోయేది లేదని ప్రకటించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ప్రభుత్వ హోమియో ఆస్పత్రిని ప్రారంభంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైద్యులు, పార్టీ నేతలు

- హోమియో ఆస్పత్రి ప్రారంభంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని హోమియోపతి, యునాని, అల్లోపతి ప్రభుత్వ వైద్యశాఖల ఆధునీకరణలో భాగంగా పట్టణంలోని హోమియో పతి వైద్యశాలలో రూ.10 లక్షలతో రోగులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. ఈ ఆస్పత్రిని మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో కలసి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, విద్య, వైద్యానికి అధిక ప్రాముఖ్యతను ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఇక్కడ యోగా ఇన్‌స్ట్రక్టర్ సైతం అందుబాటులో ఉన్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు మోహనక్రిష్ణ, పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, కో-ఆప్షన్ సభ్యులు రెహానా, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాగతిలో 'వికసిత్ భారత్'



'వికసిత్ భారత్' ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఈ సుధాకర్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పథకాలన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులకు అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పథకాల వివరాలతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కృష్ణవేణి, సర్పంచ్ షంషీర్ బాషా, ఎంఈఓ కేశవరెడ్డి, ఏఈ జ్యోతమ్మ, పంచాయతీ కార్యదర్శి వసుంధర, ఉపాధి హామీ జేఈ ధనుంజయుడు, సర్వేయర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి శాంతిపురంలో..

శాంతిపురం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకు శుక్రవారం నుంచి వచ్చే జనవరి 20 వరకూ మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయడంతోపాటు ఆయా పథకాలు అందని వారిని గుర్తించి దరఖాస్తు చేయిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిపి మొత్తం 17 మంది అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం జల్లిగానిపల్లెలో, పెద్ద బొమ్మనపల్లెలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

లాంగ్ జంప్‌లో జయలక్ష్మి ప్రతిభ



జయలక్ష్మికి మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీఏ విద్యార్థిని సీడి జయలక్ష్మి ఇటీవల తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో జరిగిన ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ మీట్ లాంగ్ జంప్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించింది. గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు జయలక్ష్మిను అభినందించారు. ఆమెకు మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు.

అయ్యప్ప భక్తులకు విరాళం

పుంగనూరు: పట్టణం నుంచి శబరిమలైకు వెళ్తున్న అయ్యప్ప భక్తులకు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం వంటసామగ్రి, బియ్యం, కూరగాయలు విరాళంగా ఇచ్చారు. పట్టణానికి చెందిన దళిత నాయకుడు సంకల్ప సొసైటీ అధ్యక్షుడు రాజుతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు కొండవీటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప భక్తులకు బియ్యం, కూరగాయలు అందజేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

కనిగిరి కొండకు త్వరలో తారురోడ్డు



మధుసూదన్‌రెడ్డితో పెనుగొండ పరిశీలకులు

పూతలపట్టు: మండలంలోని కనిగిరి కొండకు త్వరలో తారురోడ్డు రానుంది. కనిగిరి కొండకు తారురోడ్డు నిర్మాణానికి అనుమతి కోసం అటవీ, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భక్తుల సౌకర్యార్థం మేరకు రోడ్డు వేయాలని ఆయనకు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆయన కనిగిరి కొండ తారురోడ్డు నిర్మాణ విషయమై టీటీడీ అధికారులకు తెలియజేశారు. టీటీడీ అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలో కనిగిరి కొండకి తారురోడ్డు వేయడానికి అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుగుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంధన వనరుల పరిరక్షణపై అవగాహన

సోమల: ఇంధన వనరుల పరిరక్షణపై నంజంపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగం, దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. హెచ్ఎం కుసుమాంబ మాట్లాడుతూ..వనరులను దుర్వినియోగం చేయకుండా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ట్రాన్స్‌కో సిబ్బంది

అర్హులందరికీ ఓటు హక్కు

- 9,655 మంది దరఖాస్తుల స్వీకరణ
- ఈఆర్వో ప్రభాకర్ రెడ్డి



చౌడేపల్లెలో అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్వో ప్రభాకర్‌రెడ్డి

చౌడేపల్లె: ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ ఓటు హక్కు కల్పిస్తామని ఈఆర్వో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న దరఖాస్తులను గురువారం పరిశీలించి ఆమోదించారు. పుంగనూరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబర్ 2,3,4 వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఓటు హక్కు కోసం, చిరునామా మార్పులు-చేర్పులు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపుల కోసం దరఖాస్తులు స్వీకరించామన్నారు. మొత్తం 9,655 దరఖాస్తులు వచ్చాయని, వాటిని బీఎల్‌ఓల పర్యవేక్షణలో పరిశీలించి అర్హత ఉన్నవారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. అలాగే ఫారం7,8 లను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించిన అనంతరం మార్పులు-చేర్పులతో పాటు తొలగింపులు చేస్తామన్నారు. ఈ క్యాంపుల్లో ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకుని 9వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించిన వారికి జనవరి 5వ తేదీన రూపొందించనున్న తుది ఓటర్ల జాబితాలో వివరాలు అప్‌డేట్ అవుతాయన్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు, వసతులపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.